పేదరికం - ఆకలితో అల్లాడుతున్న అమెరికా ప్రజలు

అమెరికా పెద్ద సంపన్న దేశమని, భూతల స్వర్గమని మధ్యతరగతి ప్రజలు ఊహల్లో విహరిస్తూ ఉంటారు. వాస్తవం అందుకు విరుద్ధం. ఆ దేశానికి పెద్ద ఎత్తున అప్పులు ఉన్నాయి. వెనుకబడిన దేశాల సహజవనరులను కొల్లగొట్టడం, ఆయుధ వ్యాపారం చేయటం ద్వారా దాని ఆర్థికవ్యవస్థ సడుస్తున్నది. బడా కార్పొరేట్‌సంస్థలు ఆ దేశ ఆర్థికవ్యవస్థను కొల్లగొడుతుంటే, పేదలు దుర్భర దారిద్ర్యంలో కొట్టుమిట్టాడుతున్నారు. యువతకు ఉపాధి దొరకక దోపిడీలు, హత్యలకు పాల్పడుతున్నారు. ప్రపంచబ్యాంక్ తాజా నివేదిక ఈ వాస్తవాలకు అద్దం పట్టింది.

ప్రపంచబ్యాంక్ నివేదిక ప్రకారం అమెరికాలో నిరుద్యోగం పెరిగిపోతూ ఉన్నది. ఎప్పుడూ లేనివిధంగా ఉద్యోగ-ఉపాధి తగ్గుముఖం పట్టింది. ఆ దేశ ప్రజల్లో 16.5 శాతంమంది పేదరికంలో మగ్గుతున్నారు. రోజుకి రెండు డాలర్లకంటే తక్కువ ఆదాయంతో జీవించే కుటుంబాల సంఖ్య 6,37,001 నుండి 16.6 లక్షలకు పెరిగింది. 1995 సం॥లో కడు పేదరికంలో ఉన్న కుటుంబాలు 1.7 శాతంగా ఉంటే 2010 సం॥కి 3 శాతం, 2011 సం॥ 5 శాతానికి పెరిగింది. 51 శాతం మంది మహిళలు ఒంటరి జీవితం గడుపుతున్నారు. 2013 సం॥లో 33 శాతం పిల్లల తల్లితండ్రులకు ఉపాధి, ఉద్యోగాలు లేవు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 60 శాతం పిల్లలు దారిద్ర్యంలో ఉండి సంరక్షణ కేంద్రాల్లో పెరుగుతున్నారు. ఐక్యరాజ్యసమితికి చెందిన యూనిసెఫ్ అంచనాలో 41 ధనిక దేశాల్లో అమెరికా 36వ స్థానంలో ఉంది. అమెరికా సెన్సెక్స్‌బ్యూరో ప్రకారం ఆ దేశంలోని 5 కోట్లమంది ప్రజలు అత్యంత పేదరికంలో జీవిస్తున్నారు. వారు ఫుడ్ బ్యాంకుల్లో ఆహారం పొందుతున్నారు. ఆకలి చల్లార్చుకొనేందుకు ఉదయం ఆరుగంటలకే పేదలు బారులు తీరి వాటి ముందు నుంచుంటున్నారు. 30 శాతం ప్రజలు అప్పుల్లో కూరుకుపోయారు. 2011 సం॥లో 3 లక్షల మంది ఆకలితో చనిపోయారు. ఆర్థిక అసమానతలు, జాతి వివక్షల వలన ఘర్షణలు, దోపిడీలు, దొంగతనాలు పెద్దఎత్తున జరుగుతున్నాయి. అమెరికాలో ఉన్న ఈ పరిస్థితులను గమనిస్తే అది భూతలస్వర్గం కాదని పేదలను పీక్కుతినే రాక్షసులకు స్వర్గమని చెప్పాల్సిన పనిలేదు.

అమెరికాలో పేదరికం పెరగటానికి ఏమిటన్నదానికి వచ్చే సమాధానం ఒకటే. గుత్తపెట్టుబడిదారుల ఆస్తులు పెరిగి దేశ సంపద వారి వద్ద పోగుపడటం, సంపదలు సృష్టిస్తున్న కార్మికులకు, పేదలకు దేశ సంపద దక్కక పోవటమే కాక సామ్రాజ్యవాద అగ్రరాజ్యంగా ఉన్న అమెరికా ప్రపంచ ఆధిపత్యం కోసం అర్రులు చాస్తూ ప్రపంచ పోలీసుగా వ్యవహరించచూస్తున్నది. వెనుకబడిన దేశాలను బెదిరించి తన చెప్పుచేతల్లో ఉండాలని, అందుకు లొంగని దేశాలపై యుద్ధాలకు పాల్పడుతున్నది. అనేక దేశాల్లో అంతర్‌యుద్ధాలు సృష్టించి తన మాట వినని ప్రభుత్వాలను కూల్చివేయిస్తున్నది. అమెరికా సాగిస్తున్న దురాక్రమణ యుద్ధాలకు పెద్దఎత్తున ఆర్థికవనరులను మళ్లించవలసి వస్తున్నది. ప్రజలపై పెనుభారాలు మోపుతున్నది. వారికి అందుతున్న పథకాల్లో పెద్దఎత్తున కోత విధిస్తున్నది. ఫలితంగా పేదల జీవితాలు దుర్భరంగా మారుతుంటే, ఆయుధ వ్యాపారులు పెద్దఎత్తున లాభాలు పొందుతున్నారు. ప్రజల కొనుగోలు శక్తి పడిపోవటంతో ఉత్పత్తిలో కోత విధిస్తున్న ఫలితంగా కార్మికులు ఉపాధి కోల్పోతున్నారు. ఈ పరిస్థితులే అమెరికాలో ఉపాధిలేమి, పేదరికం పెరగటానికి కారణం.

అమెరికా ప్రజలు పేదరికం నుండి బయట పడాలంటే, దాని సామ్రాజ్యవాద విస్తరణ విధానాలకు వ్యతిరేకంగా సంఘటిత ఉద్యమాలు సాగించాలి. ఆ దేశం సాగిస్తున్న దురాక్రమణ యుద్ధాలకు వ్యతిరేకంగా వివిధ దేశాల్లో సాగుతున్న ప్రజా పోరాటాలకు సంఘీభావం తెలపాలి. గుత్తపెట్టుబడిదారీ వర్గానికి వ్యతిరేకంగా, దేశ సంపద ప్రజలకు దక్కాలన్న పోరాటాన్ని ఎక్కుపెట్టాలి. యుద్ధ పరిశ్రమలు కాకుండా ప్రజల అవసరాలను తీర్చేవిధంగా ఉత్పత్తిని పెంచి, ఉపాధి కల్పించి, నిరుద్యోగ సమస్య పరిష్కరించాలని అమెరికా ప్రజలందరూ రోడ్లను ముంచెత్తాలి.

ooooo